క్లుప్తంగా

35 పశువులకు వైద్యసేవలు



భర్తవానిపాలెంలో పశువులకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి గాయత్రి

వేపాడ: మండలంలోని భర్తవానిపాలెంలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్యశిబిరంలో 35 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు అందించారు. డాక్టర్ కోరాడ గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సిబ్బంది పశువులకు గర్భకోశ చికిత్సలతో పాటు సాధారణ వైద్యసేవలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ.. పుట్టిన పెయ్యిలు, దూడలకు ముర్రుపాలు పట్టాలన్నారు. ముర్రుపాలలో వ్యాధినిరోధక శక్తి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శిరీషారాణి

జామి: మండలంలోని బలరాంపురంలో జరుగుతున్న స్వమిత్వ సర్వే ప్రక్రియను డివిజనల్ పంచాయతీ అధికారి శిరీషారాణి శుక్రవారం పరిశీలించారు. సర్వే ప్రక్రియ ఏ విధంగా నిర్వహిస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆర్‌బీపురంలో పర్యటించారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్, పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఉమ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బానాదిలో ఉచిత వైద్యశిబిరం



బానాదిలో కంటి రోగులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

వేపాడ: మండలంలోని బానాదిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 206 మందికి వైద్యసేవలు అందించినట్లు నిర్వాహకుడు కండిపల్లి రమేష్ తెలిపారు. క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి వైద్యులు శ్రావణి, ప్రసన్నకుమార్, శివాజీ, షాలిని, లక్ష్మణరావు, తదితరులు రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో బానాది, ఎం.శింగవరం, బల్లంకి, రెడ్డివానిపాలెం, పోతంపేట గ్రామాలకు చెందిన రోగులు పాల్గొన్నారు.

ముగిసిన వేణుగోపాల స్వామి పవిత్రోత్సవాలు



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

జామి: మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరిలో ఎంతో పురాతనమైన వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి ప్రారంభమైన స్వామివారి పవిత్రోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరిశీలన



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ హేమసుందర్, తదితరులు

గుర్ల: మండలంలోని ఆనందపురం ఎస్‌డబ్ల్యూపీసీని డీఎల్‌పీఓ హేమసుందర్ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో పూర్తి స్థాయిలో చెత్త సేకరించాలని పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణను ఆదేశించారు. పొడి, తడి చెత్తలను వేర్వేరుగా నిల్వ చేయాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించాలని సూచించారు. అనంతరం సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణాదేవి ఉన్నారు.

ఊపిరి పోసిన వాన..

- ఖాలాల్లో ముమ్మరంగా వరినాట్లు
- పొలంబాట పట్టిన రైతాంగం
- వరుణుడు కరుణించినా పట్టించుకోని ప్రభుత్వం
- వేధిస్తున్న ఎరువుల కొరత
- ఆందోళనలో అన్నదాత



మల్లివీడు గ్రామ సమీపంలో ట్రాక్టర్‌తో దమ్ము పడుతున్న రైతు

లక్కవరపుకోట: కొద్ది రోజుల కిందట వరకు వర్షాలు కురవడంతో నియోజకవర్గ పరిధిలో ఉభాలు జోరుగా సాగుతున్నాయి. రైతులు, కూలీలు ఎంతో ఉత్సాహంగా పొలంబాట పడుతున్నారు. ప్రస్తుత ఏడాదికి సంబంధించి నియోజకవర్గ పరిధిలో 16,533 హెక్టార్లలో సాగు చేపట్టాల్సి ఉండగా.. వారం రోజుల కిందటి వరకు సుమారు ఏడు వేల హెక్టార్లలో వరి ఉభాలు జరిగాయి. అయితే ప్రస్తుతం చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు ఎంతో హుషారుగా ఉభాలు చేపడుతున్నారు.

చెరువులకు జలకళ..

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే వర్షాలు అడపాదడపా కురుస్తున్నా చెరువుల్లో నీరు చేరిన దాఖలాలు లేవు. అయితే తాజా వర్షాలతో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. గెడ్డలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.

పెరిగిన పెట్టుబడి భారం..

వరినాట్ల ప్రక్రియ గతంతో పోల్చితే ప్రస్తుతం భారంగా మారింది. దమ్ము పట్టే ట్రాక్టర్ల అద్దె, కూలీల వేతనాలు, ఎరువుల ధరలు పెరిగిపోవడంతో సాగు భారంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దమ్ము పట్టే ట్రాక్టర్‌కు గంటకు రూ. 12 వందల నుంచి 14 వందల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. అలాగే మహిళా కూలీలు రూ. 450 నుంచి 550 రూపాయల వరకు.. పురుషులు రూ. 700 నుంచి 800 రూపాయల వరకు తీసుకోవడంతో అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు.

ఎరువులందక అవస్థలు..

గతంలో వేసిన ఊభాలతో పాటు ప్రస్తుతం వేస్తున్న ఊభాలకు ఎరువులు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు ఇంటి వద్దే అందిచేవారు. ప్రస్తుతం ఎరువులు దొరక్క రైతులు బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా అనకాపల్లి జిల్లా ఆనందపురం, విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలాల్లో యూరియా బస్తా రూ. 550 నుంచి 6 వందల రూపాయల వరకు.. డీఏపీ బస్తా రూ. 1700 నుంచి 1900 రూపాయల వరకు చెల్లించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

కొంతమేర అందజేశాం..



రైతులకు అవసరమైన ఎరువులను పూర్తి స్థాయిలో తెప్పించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో ఎస్.కోట, కొత్తవలస మండలాల్లో కొంతమేర ఎరువులు అందజేశాం. మరో రెండు రోజుల్లో మిగతా మండలాలకు ఎరువులను పూర్తి స్థాయిలో అందజేస్తాం.
– బి.భానులత, కొత్తవలస వ్యవసాయ సబ్‌డివిజన్ అధికారి

బ్లాక్ మార్కెట్‌లో కొంటున్నాం..



రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. దీంతో బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికే వ్యవసాయం భారంగా మారింది. దీనికితోడు ప్రభుత్వ సహకారం పూర్తిగా కరువైంది. ఇలా అయితే మరో రెండు, మూడు సంవత్సరాల్లో వ్యవసాయానికి స్వస్తి చెప్పాల్సి వస్తుంది.
– జి.పైడిరాజు, రైతు, లింగంపేట గ్రామం, లక్కవరపుకోట మండలం



రంగరాయపురం గ్రామ సమీపంలో వరి నారు తీస్తున్న మహిళా రైతులు

వీళ్లు అర్హులు కారట..?

- అడ్డగోలుగా పెన్షన్ల తొలగింపు
- అభాగ్యుల ఆక్రందనలు



బతుకుదెరువు లేక అల్లాడుతున్న అరుణకుమారి



పక్షవాతంతో మంచానికే పరిమితమైన సూరీడమ్మ

శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వం పెన్షన్ల రీ వెరిఫికేషన్ పేరిట ఎంతోమంది అర్హుల పెన్షన్లు తొలగిస్తోంది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా దివ్యాంగులకు నోటీసులు జారీ చేసి మరోసారి సదరం సర్టిఫికెట్ తీసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తోంది. ఇదే అదునుగా ఎంతోమంది పెన్షన్లు నిలిపేస్తోంది. మండలంలోని ధర్మవరం గ్రామంలో నివాసం ఉంటున్న గనివాడ అరుణకుమారి రెండు చేతులూ సక్రమంగా పనిచేయవు. ఆమె పని కూడా సొంతంగా చేసుకోలేని పరిస్థితి. ఈ క్రమంలో ఆమెను దివ్యాంగురాలిగా గుర్తిస్తూ 2002లో వికలాంగ సర్టిఫికెట్ మంజూరు చేశారు. అప్పటి నుంచి నిన్నమొన్నటి వరకు కూడా ఆమె పింఛన్ అందుకుంది. తాజాగా కూటమి ప్రభుత్వం మాత్రం ఆమె అనర్హురాలంటూ పెన్షన్ నిలిపివేసింది. అలాగే అదే గ్రామానికి కిల్లి సూరీడమ్మ కొన్నేళ్లుగా మంచానికే పరిమితమైంది. ఈమెకు పక్షవాతం రావడంతో నడిచే అవకాశం లేకుండా పోయింది. కొన్నేళ్లుగా ప్రభుత్వం ఇస్తున్న పింఛనే ఆమెకు ఆధారం. ఆమెకు 78 శాతం వికలాంగత్వం ఉన్నట్లు వైద్యులు సర్టిఫికెట్ ఇచ్చినా పింఛన్ ఆపేశారు. ఇటువంటి ఎంతోమంది దివ్యాంగులు కూటమి కుట్రలకు బలవుతున్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ



రోడ్డు నిర్మాణానికి పూజ చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

శృంగవరపుకోట: మండలంలోని జీడిపాలెం గ్రామంలో రోడ్డు పనులకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామంలో నిర్మిస్తున్న వంద పడకల క్యాన్సర్ ఆస్పత్రికి ఈ రోడ్డు అనుసంధానంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఖాళీ ప్రదేశాల్లో విత్తన బంతులు చల్లారు. అలాగే పది మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా సత్యసాయి దివ్యామృతం వ్యవస్థాపకుడు స్వామి మాట్లాడుతూ.. ఆస్పత్రికి రోడ్డు ఏర్పాటుకు సహకరించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆస్పత్రిలోని బ్లాకుల్లో ఒక దానికి కలెక్టర్ అంబేడ్కర్ పేరు పెడతామని ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కీర్తి, తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు అన్యాయం..



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు, బొంతల వెంకటరావు



ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు పత్రాలు అందజేస్తున్న లబ్ధిదారులు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు

కొత్తవలస: పరిశీలన పేరిట కూటమి ప్రభుత్వం అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలిగించడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బొంతల వెంకటరావుతో కలిసి మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదన్నర కాలంలో .. కొత్త పింఛన్లు మంజూరు చేయకపోగా ఉన్నవాటిని పరిశీలన పేరుతో తొలిగించడం దురదృష్టకరమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ... అలాగే వితంతవులకు, దివ్యాంగులకు క్రమం తప్పకుండా పింఛన్లు అందజేశామన్నారు ప్రస్తుతం కావాలనే దివ్యాంగులకు వికలాంగత్వం సరిపోవడం లేదనే సాకుతో పింఛన్లు నిలిపివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన పింఛన్లను తక్షణమే పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో కోతలే తప్ప కొత్త పథకాలు ఉండవని ఎద్దేవా చేశారు.

తొలగించడం తగదు

దత్తిరాజేరు: దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్లను తొలగించడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకుడు రొంగలి వెంకన్న అన్నారు. పింఛన్లు తొలగించిన ఎనిమిది మంది లబ్ధిదారులతో కలసి పాత, కొత్త సదరం సర్టిఫికెట్లు, ఇతర పత్రాలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీకి శుక్రవారం అందజేశారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారికి పింఛన్లు మంజూరు చేయగా.. కూటమి నాయకులు కావాలనే దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. అర్హులకు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు.

వినియోగదారులతో సక్రమంగా మెలగాలి

- ఏపీఎస్ఈపీడీసీఎల్ డీఈ త్రినాథ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ త్రినాథ్

మెరకముడిదాం: వినియోగదారులతో సక్రమంగా మెసులుకోవాలని ఏపీఎస్ఈబీ డీఈ పి.త్రినాథ్ విద్యుత్‌శాఖ సిబ్బందికి సూచించారు. మండలంలోని గర్భాం సెక్షన్ కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, లైన్‌మన్లు, ఇతర సిబ్బందితో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడ లోఓల్టేజీ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ కనెక్షన్లు వీలైనంత త్వరలో ఇస్తామని తెలిపారు. బిల్ కలెక్టర్లను నియమించాలని ప్రజాప్రతినిధులు తాడ్డి వేణుగోపాలరావు, తాడ్డి సన్యాసినాయుడు, తాడ్డి చంద్రశేఖర్, పెనుమజ్జి అప్పలనారాయణ, సత్తారు శ్రీనివాసరావు, తదితరులు కోరగా.. వెంటనే ఆయన స్పందిస్తూ బిల్ కలెక్టర్‌ను నియమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ దివాకరరావు, పలువురు విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భూమితో పాటు మార్కెట్ ధర ఇవ్వాల్సిందే..

- బాబూ జగ్జీవన్‌రామ్ సుజల స్రవంతి పోలవరం కాలువ నిర్వాసితులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి నెక్కల నాయుడుబాబు

కొత్తవలస: బాబూ జగ్జీవన్‌రామ్ సుజల స్రవంతి పోలవరం ఎడమ కాలువ నిర్మాణానికి సేకరించబోయే భూమికి బదులుగా భూమి ఇస్తూ, బహిరంగ మార్కెట్ ధర వర్తింపజేయాలని రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. మండలంలోని రామలింగాపురంలో కాలువ నిర్మాణానికి సంబంధించి పార్వతీపురం, విజయనగరం జిల్లాల ప్రత్యేక ఉప కలెక్టర్ ఎం.ఎస్.కళావతి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ధరకు రెండున్నర రెట్లు పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో సుమారు 87 మంది రైతుల నుంచి 84.2 ఎకరాల జిరాయితీ భూమి, 10 ఎకరాల డీ పట్టా భూమి, 8 ఎకరాల ప్రభుత్వ భూమి సేకరించడానికి నిర్ణయించామన్నారు. రైతుల తరఫున వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, గ్రామపెద్ద నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ.. రైతుల దగ్గర నుంచి సేకరించనున్న భూమి చాలా విలువైనదని చెప్పారు. భూమికి బదులు వేరే చోట భూమి ఇస్తూ.. మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు సంతృప్తికరమైన పరిహారం అందజేయకపోతే భూములు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నెక్కల గౌరినాయుడు, భూసేకరణ డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, జేఈ సుహాసిని, కొత్తవలస ఆర్‌ఐ షణ్ముఖరావు, ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ రొంగలి కృష్ణారావు, గ్రామానికి చెందిన పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ



రేవళ్లపాలెంలో సంతకాలు చేస్తున్న రైతులు

శృంగవరపుకోట: అరవై రోజులుగా తమ భూముల కోసం, భుక్తి కోసం పోరాటం చేస్తున్న జిందాల్ నిర్వాసితులకు మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం రేవళ్లపాలెంలో ప్రారంభించారు. జాగరపు రామకృష్ణ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ రఘురాజు హాజరు కాగా పలువురు గ్రామ రైతులు జిందాల్ బాధిత రైతులకు మద్దతుగా సంతకాలు చేశారు. రైతులను మోసం చేసిన జిందాల్‌పై అవిశ్రాంత పోరాటం చేస్తున్నామని రఘురాజు చెప్పారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. జిందాల్ వల్ల నష్టపోయిన రైతులకు మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, బి.గోవింద, బుజ్జి, వెంకటరావు, పోతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి ఎంత వాటాలున్నాయి..?

జిందాల్ చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నాయకులు, అధికారులకు ఎవరికి ఎంత వాటాలున్నాయో ధైర్యంగా ప్రకటించాలని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులతో కలిసి ఆందోళన శుక్రవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిందాల్‌కు వ్యతిరేకంగా నాయకులు గాని అధికారులు గాని మాట్లాడకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శృంగవరపుకోట: పట్టణంలోని 11 కేవీ లైన్ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో విజయనగరం ఈఈ జి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పట్టణంలోని రామ్‌నగర్, ఏఓ హోమ్స్, పందిరప్పన్న జంక్షన్, పోలీస్‌స్టేషన్, చెరుకు కాటా, రైల్వేస్టేషన్ రోడ్, ఎం.కె.రావు కాలనీ, ఎస్.కోట సబ్‌స్టేషన్, దేవీగుడి వరకు ప్రధాన రహదారి, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, బర్మా కాలనీ, వైఎస్సార్ కాలనీ, రేగ పుణ్యగిరి, అయ్యప్ప లేఔట్, పుణ్యగిరి రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధ్యతతో విధులు

దత్తిరాజేరు: ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహిస్తూ స్వమిత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సంక్షేమ కార్యదర్శులకు స్వమిత్వపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ వాణిశ్రీతో కలిసి ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాలలో ప్రతి గృహానికీ కొలతలు వేసి కుటుంబ సభ్యులు ఎంత విస్తీర్ణంలో నివాసం ఉంటున్నారు.. వారి గృహంలో వాడుతున్న వస్తువులు ఫ్రిజ్, ఏసీ, తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో శిక్షకుడు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడ్ని పూజిద్దాం..

వేపాడ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని హరిత సొసైటీ వ్యవస్థాపకుడు ఆర్. హరిబాబు అన్నారు. ఈ మేరకు మండలంలోని శింగరాయి, జగ్గయ్యపేట, ఉసిరి గ్రామాల్లో శుక్రవారం పర్యటించి మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల జల, వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు చల్లా త్రినాథ్, సభ్యులు అప్పలనాయుడు, ఆర్. భవానీ, ఎం.గణేష్, కె.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్‌లను అభివృద్ధి చేయండి

వేపాడ: పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేసి ఆకుకూరలు, కూరగాయలు పండించాలని ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. మండలంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సామగ్రి అందజేత

కొత్తవలస: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లను శుభ్రపరిచేందుకు అవసరమైన రసాయనాలు, చీపుర్లు, తదితర సామగ్రిని శుక్రవారం అందజేశారు. వియ్యంపేట క్లస్టర్ పరిధిలో గల 12 పాఠశాలలకు ఈ సామగ్రి పంపిణీ చేసినట్లు వియ్యంపేట హైస్కూల్ హెచ్‌ఎం బి.గోవిందరాజులు, సీఆర్‌ఎంటీ వై.అర్జునరావు తెలిపారు. సామగ్రిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి



చీపురుపల్లి: చలో కలెక్టరేట్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు



శృంగవరపుకోట: చలో కలెక్టరేట్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

చీపురుపల్లి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ మండల అధ్యక్షుడు బి.జగదీష్ కోరారు. ఈ మేరకు ఆగస్టు 25న చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిపోతున్నప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కాలేదు సరికదా మరింత పెరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థ వెనక్కి వెళ్లిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6,400 కోట్ల ఉపకార వేతన బకాయిలున్నాయని.. దీంతో ఫీజులు చెల్లించలేక పేద విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు రూ.3 వేల మెస్ చార్జీలు ఇవ్వాలని, జీఓ 77ను రద్దు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ ప్రతినిధులు శ్రీలత, మధు, సూర్య, సాయి, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

శృంగవరపుకోట: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 25న చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు వి.భారతి పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్. రత్న మాట్లాడుతూ.. కూటమి హయాంలో విద్యావ్యవస్థ నీరుగారి పోయిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణమాస పూజలు

చీపురుపల్లి: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం కావడంతో పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంతో పాటు మండలంలోని రామలింగాపురం పరిసరాల్లో ఉన్న మానసాదేవీ నాగశక్తి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

శృంగవరపుకోట/జామి: ఎస్.కోటలోని దుర్గమ్మకు శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని నిమ్మకాయలతో అలంకరించారు. జామి విజయదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



శృంగవరపుకోట: నిమ్మకాయల అలంకరణలో దుర్గమ్మ



చీపురుపల్లి: పండ్ల అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



జామి: ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ



చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో కుంకుమ పూజలు

నేడు రక్తదాన శిబిరం

చీపురుపల్లి: పట్టణంలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు కేంద్ర ఇన్‌చార్జ్ బీకే శాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజయోగిని ప్రకాశమణి దాది పుణ్యస్మృతి దినోత్సవంలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.